

# జలవనరులపై నిర్లక్ష్యం వీడండి..

## భగీరథమ్మ చెరువుపై కన్నేసిన అక్రమార్కులు

గచ్చిబౌలి: భగీరథమ్మ చెరువుకు ముప్పు వాటిల్లుతోంది. ఇరిగేషన్ అధికారుల ఉదాసీనత చెరువు ఉనికే ప్రశ్నార్థకంగా తయారైంది. బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలు, ఎఫ్‌టీఎల్‌లో రోడ్డు, నీటి వ్యాపారంతో చెరువు కుంచించుకుపోతోంది. బఫర్ జోన్‌లో కొందరు వ్యక్తులు లేఅవుట్ వేసి ఇరిగేషన్ అధికారులకు సవాల్ విసురుతున్నారు. కొద్ది సంవత్సరాలుగా నిర్మాణాలు వెలవడం, కూల్చివేయడం కొనసాగుతూనే ఉంది. ఇరిగేషన్, రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారుల మధ్య సమన్వయలోపం ప్రైవేట్ వ్యక్తులకు వరంగా మారుతోంది. చెరువు రక్షణ కోసం పటిష్టమైన చర్యలు తీసుకోకుంటే నీటి వనరుల ఉనికి ప్రమాదంలో పడే అవకాశం ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శేరిలింగంపల్లి మండల పరిధిలోని నానక్‌రాంగూడ సర్వే నంబర్లు 150,151, నార్సింగి మండల పరిధిలోని పుప్పాలగూడ సర్వే నంబర్లు 450, 451లలో 54 ఎకరాలలో భగీరథమ్మ చెరువు విస్తరించి ఉంది.



నానక్‌రాంగూడలోని భగీరథమ్మ చెరువు

### మట్టి డంపింగ్

నానక్‌రాంగూడలోని భగీరథమ్మ చెరువు ఎఫ్‌టీఎల్‌లో కొద్దిరోజులుగా మట్టి, బండరాళ్లను డంప్ చేస్తున్నారు. పూడ్చివేస్తున్న ప్రాంతంలో ఓ వ్యక్తి లేఅవుట్ వేసినట్లుగా ఇరిగేషన్ అధికారులు గుర్తించారు. కాగితాలపై వెలిసిన లే అవుట్‌లో ప్లాట్లను అమ్మేశారు. దీంతో కొందరు వ్యక్తులు తమ పాట్లను కాపాడుకోవాలని ఎల్‌టీఎల్‌లో మట్టి, బండరాళ్లతో పూడ్చుతున్నారు. 2014లో సర్వే చేసి ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించారు. అప్పటికే ఎఫ్‌టీఎల్ ప్రాంతంను పూడ్చివేశారు.దీన్ని బఫర్ జోన్‌గా గుర్తించడంలో అధికారులు ప్రైవేట్ వ్యక్తులతో కుమ్మక్కయ్యారని అప్పట్లో తీవ్ర విమర్శలకు దారితీసింది. ఎఫ్‌టీఎల్ కోసం వేసిన ఫెన్సింగ్‌ను పూర్తిగా తొలగించారు. అంతే కాకుండా బఫర్ జోన్‌లో నిర్మాణాలు చేపట్టారు.

కొనసాగుతున్న నిర్మాణాలు.. నీటి వ్యాపారం

ఫెన్సింగ్ ఏర్పాటులో అధికారుల నిర్లక్ష్యం

నిర్మాణాలను తొలగించాలని అడిషనల్ కలెక్టర్ ఆదేశం

### నిర్మాణాల కూల్చివేత

భగీరథమ్మ చెరువు ఎఫ్‌టీఎల్‌లో మట్టి, బండ రాళ్ల డంపింగ్, బఫర్ జోన్‌లో నిర్మాణాలు చేపట్టడంతో అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో కొద్ది రోజుల క్రితం రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ భూపాల్ రెడ్డి భగీరథమ్మ చెరువును సందర్శించారు. ఎఫ్‌టీఎల్‌లో డంపింగ్, బఫర్ నిర్మాణాలు వెలువడంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరిగేషన్, రెవెన్యూ, జీహెచ్ఎంసీ అధికారులు ఆగమేఘాల మీద నిర్మాణాలను కూల్చి వేశారు. ఎఫ్‌టీఎల్ లోపలికి వాహనాలు రాకుండా చర్యలు తీసుకుంటున్నారు.

### ఫెన్సింగ్ వేస్తాం

భగీరథమ్మ చెరువు ఎఫ్‌టీఎల్ ఫెన్సింగ్‌ను వేసేందుకు చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ ఏఈ విశ్వం తెలిపారు. సీఎస్ఆర్‌లో భాగంగా చెరువును అభివృద్ధి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. బఫర్‌లో నిర్మాణాలు, ఎఫ్‌టీఎల్‌లో డంపింగ్ చేస్తే ఊరుకోమన్నారు.

### ఎఫ్‌టీఎల్ నిర్ధారించాలి..

భగీరథమ్మ చెరువు ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. చెరువు పూర్తిస్థాయిలో నిండితే బఫర్ జోన్ లోను నీళ్లు ఉండేవని వారు పేర్కొంటున్నారు. బఫర్ జోన్‌లో అక్రమ నీటి వ్యాపారం జోరుగా సాగుతున్నా రెవెన్యూ అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఎస్‌టీపీ ప్లాంట్ పేరిట ఎఫ్‌టీఎల్‌లో రోడ్డు నిర్మాణం చేపట్టడం విమర్శలకు తావిస్తోంది. ఎస్‌టీపీ పేరిట వేసిన రోడ్డును ఓ నిర్మాణ సంస్థ తమ అవసరాలకు ఉపయోగించుకోవడం గమనార్హం . సదరు నిర్మాణ సంస్థ ఎఫ్‌టీఎల్ సరిహద్దులను చెరిపి వేసిందనే విమర్శలు ఉన్నాయి. చెరువు బ్యూటిఫికేషన్‌ను అదే నిర్మాణ సంస్థకు ఇవ్వడం ఎంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఒక వైపు అక్రమ నిర్మాణాలు, మరో వైపు డంపింగ్, ఇంకో వైపు రోడ్డుతో చెరువుపై ముప్పేట దాడి చేస్తున్నారు.





భగీరథమ్మ చెరువు బఫర్ జోన్‌లో వెలిసిన నిర్మాణాలను కూల్చివేసిన అధికారులు

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాయదుర్గం: కొండాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు రాఘవేంద్రకాలనీ ఏ అండ్ బీ బ్లాక్ ప్రాంతంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు.

- 11 కేవీ రాజరాజేశ్వరి విద్యుత్ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి 3.30 గంటల వరకు రాజరాజేశ్వరినగర్ కాలనీ మొత్తంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

**శేరిలింగంపల్లిలో..**

శేరిలింగంపల్లి: 11 కేవీ డైమండ్ హిల్స్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు డైమండ్ హిల్స్, సాయిరాం కాలనీ, జవహర్ నవోదయ స్కూల్ సమీపంలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని నల్లగండ్ల ఏఈ వెంకటనారాయణరెడ్డి తెలిపారు.

- 11 కేవీ జవహర్ నవోదయ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు నల్లగండ్ల, అపర్ణ అపార్టుమెంట్ ఎదురుగా ఉన్న నల్లగండ్ల హుడా కాలనీ, కంచ గచ్చిబౌలి లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తారు.

## మౌంట్ ఎవరెస్టును అధిరోహించిన డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి





హఫీజ్‌పేట్: ఆసియా ఖండంలోనే ఎత్తైన ఎవరెస్టు (మౌంట్ ఎవరెస్టు)ను హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మైత్రీనగర్‌లో నివాసముండే ఆర్థోపెడిక్ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి అధిరోహించారు. మే 23న మౌంట్ ఎవరెస్టును అధిరోహించిన ఆయన బుధవారం నగరానికి చేరుకోగా తల్లిదండ్రులు ఘనంగా స్వాగతం పలికారు. రాజశేఖర్‌రెడ్డి దేశంలోనే మూడవ డాక్టర్‌గా, దక్షిణ భారతదేశంలో మొట్టమొదటి మౌంటేనర్‌గా నిలిచాడు. ఒకవైపు వైద్యసేవలందిస్తూ మరోవైపు మౌంటేనర్‌గా నిలవడం చాలా సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు.

## హరితహారం మొక్కలు సిద్ధంగా ఉంచాలి

జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా

పటాన్‌చెరు టౌన్: హరితహారం కోసం నర్సరీలలో మొక్కలను సిద్ధంగా ఉంచాలని జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా అన్నారు. బుధవారం పటాన్‌చెరు మండలం పరిధిలోని ఘన్‌పూర్ గ్రామంలో మండల పంచాయతీ అధికారి హరిశంకర్‌గౌడ్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని వైకుంఠధామం, డంపింగ్ యార్డ్, రైతు వేదిక, నర్సరీలతో పాటు అభివృద్ధి పనులను తనిఖీ చేశారు. అనంతరం డీపీఓ సాయిబాబా మాట్లాడుతూ... వర్మి కంపోస్ట్ ఎరువులను తయారుచేసి నర్సరీలకు పంపిణీ చేయడంతో పాటు విక్రయించి పంచాయతీకి ఆదాయాన్ని సమకూర్చాలని సూచించారు. ప్రతి గ్రామంలో సెగ్రిగేషన్ షెడ్లు వినియోగంలో ఉండేలా చూడాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం, తాగునీరు, విద్యుత్ దీపాల సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సమస్యలు పరిష్కరించాలని, గ్రామ ,మండల స్థాయి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పాశమైలారం కార్యదర్శి రిజ్వాన్ పాల్గొన్నారు.



ఘనపూర్ నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా

## లోఓల్టేజీ సమస్యను పరిష్కరించండి

రాయదుర్గం: లోఓల్టేజీ సమస్యతో మూడు రోజులుగా అవస్థలు పడుతున్నామని నానక్‌రాంగూడ లోధ బస్తీవాసులు వాపోతున్నారు. నానక్‌రాంగూడలోని పోచమ్మ దేవాలయం వద్ద ఉండే ట్రాన్స్‌ఫార్మర్ నుంచి బస్తీకి విద్యుత్ సరఫరా కొనసాగుతోందని మూడు రోజులుగా టీవీలు, ట్యూబ్‌లు వెలగడం లేదని, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు పని చేయడం లేదని వారు వాపోతున్నారు. విద్యుత్ అధికారులు లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు.

## అక్రమ నిర్మాణం కూల్చివేత



రాయదుర్గం: ఖాజాగూడ పెద్ద చెరువు పరిధిలో నిర్మాణాలను జీహెచ్ఎంసీ అధికారులు కూల్చివేశారు. గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడ పెద్ద చెరువు పరిసరాల్లో ప్రహరీగోడ నిర్మించగా జీహెచ్ఎంసీ వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్, డిమాలిషన్ విభాగం నోడల్ ఆఫీసర్ స్నేహ శబరీష్ ఆదేశంపై అధికారులు జేసీబీతో ప్రహరీగోడను కూల్చివేశారు. అనుమతిలేని నిర్మాణాలు, ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలు చేస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

## 18నెలల చిన్నారికి అరుదైన శస్త్రచికిత్స



శస్త్రచికిత్స చేసిన డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, వైద్య సిబ్బంది

మాదాపూర్: కదలిక, నడవలేకపోతున్న 18 నెలల చిన్నారికి న్యూరోమానిటరింగ్ పద్ధతిలో శస్త్ర చికిత్స చేశారు మాదాపూర్ మెడికవర్ ఆస్పత్రి వైద్యులు. దీనికి సంబంధించిన వివరాలను బుధవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ విస్తరించి ఉన్న కణితి కారణంగా చిన్నారి ఎనిమిది నెలలుగా ఏడవడం, తల తిప్పకపోవడం, తీవ్రమైన కాలు నొప్పి, నడవలేని స్థితి, శ్వాస తీసుకోలేకపోవడం వంటి సమస్యలతో తీసుకువచ్చారన్నారు. పరీక్షలు నిర్వహించి కణితిగా గుర్తించి దాన్ని పూర్తిగా తొలగించినట్లు తెలిపారు. ఇది అతి తక్కువ హానికర ప్రక్రియ అని తెలిపారు. శస్త్రచికిత్స జరిగిన రెండవరోజు నుంచే శిశువు పరిస్థితి మెరుగుపడిందని, వారంలోనే 70శాతం మెరుగైందన్నారు. ఈ సమావేశంలో డాక్టర్లు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మంచినీటి వాల్వ్‌కు మరమ్మతులు



రిక్షాపుల్లర్స్ కాలనీలో లీకవుతున్న తాగునీరు (నాడు)



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి సర్కిల్ వివేకానంద నగర్ డివిజన్ రిక్షాపుల్లర్స్ కాలనీ ప్రధాన రహదారిలో మంచినీటి పైపులైన్‌ల వాల్వ్‌లు లీకై తాగునీరు వృధాగా పోతోంది. కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయని ఈ నెల 28వ తేదిన 'ఓవైపు తాగునీరు.. మరోవైపు మురుగునీరు శీర్షికన సాక్షిలో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించి బుధవారం సిబ్బందితో మంచినీటి వాల్వ్‌ల లీకేజీని సరిచేశారు. కలుషిత జలాలు సరఫరా కాకుండా చర్యలు చేపట్టారు. దీంతో స్థానికులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

## నార్సింగిలో కొత్త చైర్‌పర్సన్ ఎన్నికకు సిద్ధం

31న ప్రత్యేక సమావేశం

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని 18 మంది కౌన్సిలర్‌లకు ఈనెల 31వ తేదీన ఉదయం 11 గంటలకు జరిగే చైర్‌పర్సన్, వైస్ చైర్మెన్ ఎన్నిక సమావేశానికి హాజరు కావాలని మున్సిపల్ మేనేజర్ యోగేష్ నోటీసులు జారీ చేశారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం బుధవారం నోటీసులు ఇచ్చారు. నార్సింగి మున్సిపాలిటీ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లపై ఇటీవల అవిశ్వాసం పెట్టి వారిని పదవీచ్యుతులను చేసిన విషయం తెలిసిందే. ఈ రెండు పదవులకు కౌన్సిలర్‌లంతా కలిసి కొత్త వారిని ఎన్నుకోవాల్సి ఉంది. ఆ ప్రక్రియలో భాగంగా బుధవారం నోటీసులు జారీ చేశారు.

## అక్రమ పార్కింగ్‌లతో పరేషాన్



జింఖానా క్లబ్ ముందు కార్ల పార్కింగ్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-2లోని జింఖానా క్లబ్ ముందు అక్రమ పార్కింగ్‌లు స్థానికంగా రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి. క్లబ్ ఎదుట ఫుట్‌పాత్‌లను ఆక్రమించి కార్లు పార్కు చేయడమే కాకుండా రోడ్డు పైన కూడా పార్కింగ్ చేస్తుండడంతో జూబ్లీహిల్స్ వైపు నుంచి వస్తున్న వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇష్టానుసారంగా క్లబ్ ముందు అక్రమ పార్కింగ్‌లు చేస్తున్నా జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోవడం లేదు. ఉదయం 10 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు ఇదే పరిస్థితి. వాహనదారులు పలుమార్లు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదన్నారు. ఈ క్లబ్‌కు వచ్చే వాహనదారులు పక్కనే ఉన్న గల్లీలు కూడా ఆక్రమించి తమ కార్లను ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తున్నారు. క్లబ్ యాజమాన్యం నిర్లక్ష్యంతోనే అక్రమ పార్కింగ్‌లు జోరుగా సాగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇకనైనా ట్రాఫిక్ పోలీసులు స్పందించి ఇక్కడ అక్రమ పార్కింగ్‌లకు చెక్ పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెట్టాలి



ట్రాఫిక్‌పై అధిఆకరులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ సూచించారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని విజయనగర్ కాలనీ, నవోదయ కాలనీల్లో నెలకొన్న ట్రాఫిక్ సమస్యపై బుధవారం ట్రాఫిక్ పోలీస్ సిబ్బందితో ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ అవసరం ఉన్న చోట విభాగినులు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ మళ్లింపునకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్డు దాటే ప్రాంతంలో సూచిక బోర్డులు పెట్టాలని చెప్పారు. ట్రాఫిక్ సమస్యకు వెంటనే పరిష్కారం చూపాలని, ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెట్టాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ రమేష్, బీఆర్‌యస్ పార్టీ నాయకులు కాశీనాథ్ యాదవ్, సత్యనారాయణ, నవీన్, స్వరూప, లావణ్య, కాలనీవాసులు పాల్గొన్నారు.

## విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయండి



సోలార్ లైట్లతో నిర్వహిస్తున్న సంత

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్– బుద్వేల్ ప్రధాన రహదారిపై విద్యుత్ దీపాలు లేకపోవడంతో వాహనదారులు, స్థానికులు, వ్యాపారస్తులు వారాంతపు సంతకు వచ్చే ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. చీకటి కారణంగా తరుచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాపోతున్నారు. ప్రధాన రహదారిపైనే విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయకపోవడంపై జీహెచ్ఎంసీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాజేంద్రనగర్ వాటర్ వర్క్స్ కార్యాలయం నుంచి శివాంజనేయ స్వామి ఆలయం వరకు ప్రధాన రహదారి గుండా రోజు వేలాదిమంది రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే రోడ్డుకిరువైపులా వ్యాపార కేంద్రాలు కొనసాగుతున్నాయి. అలాగే ఈ రహదారి పక్కనే ప్రతి బుధవారం వారాంతపు సంత నిర్వహిస్తున్నారు. ఈ సంతలో స్థానిక ప్రజలు కూరగాయల కోసం వస్తుంటారు. ప్రతివారం సాయంత్రం 5 గంటల నుంచి 9 గంటల వరకు సంత జరుగుతుంది. వీధి దీపాలు లేని కారణంగా మహిళలు, వృద్ధులు, వ్యాపారస్తులు ఇబ్బందులకు గురవుతున్నారు. వ్యాపారులు చిన్న సోలార్ లైట్లను ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేస్తున్నారు. జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు స్పందించి వీధి దీపాలను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# ఇంకని గుంతలు..

- ఇంకుడు గుంతల నిర్వహణపై దృష్టి పెట్టని అధికారులు
- ఉన్నవి కనుమరుగవుతున్నాయ్ ర్యాలీల్లో భేష్.. నిర్వహణలో నిల్

మూసాపేట: ఇంకుడు గుంతల ఆవశ్యకతను ఈ వేసవి గుర్తు చేసింది. నగరంలో నీటి ఎద్దడితో ప్రజలు అల్లాడారు. ట్యాంకర్లు కొనుగోలు చేసే దుస్థితి ఏర్పడింది. 1500 అడుగుల వరకు ఉన్న బోర్లు కూడా ఈ వేసవి కాలంలో పూర్తిగా ఎండిపోయి ట్యాంకర్లకే పరిమితమవ్వాల్సిన పరిస్థితి నెలకొంది. రానున్న కాలంలో ఈ సమస్య మరింత జఠిలం కానున్నది. ఈ నేపథ్యంలో ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని అధికారులు అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు. కొత్త ఇంకుడు గుంతలేమో గానీ ఉన్నవాటిని పునరుద్ధరించలేదు. కనీసం వాటిని గుర్తించే ప్రయత్నాలు జరగలేదు. ఫతేనగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బోర్లు ఎండిపోయి ప్రజలు నీటి ట్యాంకర్ల కోసం వారాల తరబడి ఎదురు చూస్తున్నారు. అపార్టుమెంట్ వాసులు సైతం బిందెలు పట్టుకొని రోడ్లపై వేచి చూడాల్సిన పరిస్థితి ఉంది.



భరత్ నగర్ యువసేన గ్రౌండ్‌లో భూమికి సమాంతరంగా తయారైన ఇంకుడు గుంత

### వాటర్ ట్యాంక్ ఉన్నా తప్పని నీటి తిప్పలు...

కాలనీలలోనే అతి పెద్ద వాటర్ ట్యాంక్ ఉన్నప్పటికి రెండురోజులకు ఒకసారి వచ్చే నీటి కోసం ఎదురు చూడాల్సి వస్తోంది. అది కూడా లో ప్రెజర్‌తో అరగంట సేపే రావటంతో నీటి సమస్య మరింత తీవ్రతరమవుతోంది. బోర్లు పూర్తిగా ఎండిపోవటంతో ప్రజలు నీటి కోసం అల్లాడిపోతున్నారు. ట్యాంకర్లు బుక్ చేసినా వారాల తరబడి ఎదురు చూడాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### కనుమరుగవుతున్న ఇంకుడు గుంతలు

గతంలో కాలనీలోని పలు గ్రౌండ్స్‌లో కూడళ్ల వద్ద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం ఇంకుడు గుంతలు ఏర్పాటు చేశామనే వాటర్ వర్క్స్ అధికారులు ఈ ఏడాది ఎటువంటి ముందస్తు చర్యలు తీసుకోలేదు. కనీసం గతంలో తీసిన ఇంకుడు గుంతలకు మరమ్మతులు కూడా చేయలేదు. పలు చోట్ల ఇంకుడు గుంతలు కనుమరుగై పోయాయి. అప్పుడప్పుడు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ర్యాలీలు నిర్వహిస్తున్నారే తప్ప ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కాలనీలు, పార్కులు, కూడళ్ల వద్ద మరిన్ని ఇంకుడు గుంతలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

### నిర్వహణ లేమి.. మచ్చుకు కొన్ని

- భరత్‌నగర్ కాలనీలోని యువసేన గ్రౌండ్‌లో ఇంకుడు గుంత నిర్వహణ లేక భూమికి సమాంతరంగా అయ్యింది.
- శివసేన గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంత స్థానంలో చెత్తాచెదారం పడేయడంతో కనుమరుగైపోయింది.
- పోచమ్మ గ్రౌండ్‌లో ఉన్న మరో ఇంకుడు గుంత భవన నిర్మాణ వ్యర్థాలతో కలిసిపోయింది.
- మరో పార్కు ముందు ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతపై ఇసుక, ఇటుకలను పోసి అమ్ముతున్నారు.



శివసేన గ్రౌండ్‌లో మాయమైన ఇంకుడు గుంత



పోచమ్మ గ్రౌండ్‌లో భవన నిర్మాణ వ్యర్థాల్లో కలిసిపోయిన ఇంకుడు గుంత



భరత్ నగర్ పార్కువద్ద ఇంకుడు గుంతపై ఇసుక వ్యాపారం

## సీఎంఆర్‌ఎఫ్ మంజూరు పత్రాలు అందజేత



ఖాజాగూడవాసికి ఎల్ఓసీ పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లోని ఖాజాగూడకు చెందిన దివాకర్‌కు అత్యవసర వైద్యచికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.2.30 లక్షల ఎల్ఓసీ పత్రాలను ఎమ్మెల్యే గాంధీ బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయనిధి ఆపదలో ఉన్న వారిని ఆపన్నహస్తంలా ఆదుకుంటుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రోజాదేవి రంగారావు, ఉప్పలపాటి శ్రీకాంత్, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, బీఆర్ఎస్ నాయకులు గొట్టిముక్కల పెద్ద భాస్కర్, హరినాథ్, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ప్లాంట్ జెనెటిక్, ఏజీ వర్సిటీ ఎంఓయూ



ఏజీవర్సిటీ: భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి పరిధిలోని నేషనల్ బ్యూరో ఆఫ్ ప్లాంట్ జెనెటిక్ రిసోర్సెస్, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం మధ్య బుధవారం అవగాహన ఒప్పందం చేసుకున్నారు. క్రాప్ ఇంప్రూవ్‌మెంట్ కార్యక్రమాలలో ప్లాంట్ జెనెటిక్ వనరుల వినియోగం ప్రధాన లక్ష్యంగా ఈ ఒప్పందం కుదిరింది.అలాగే పరిశోధన, విద్యా కార్యక్రమాలలోను ఇరు సంస్థలు కలిసి పని చేయాలని నిర్ణయించాయి.దీనివల్ల పీజీ ,పీహెచ్ విద్యార్థులకు పరిశోధనలో ఎంతో ఉపయోగం ఉంటుంది. దీంతో పాటు ఇరు సంస్థల శాస్త్రవేత్తలు కలిసి పరిశోధనలు చేయడానికి ఇది చాల దోహదం చేయనుంది.రాజేంద్రనగర్‌లోని ఎన్‌బీపీజీఆర్‌లో జరిగిన కార్యక్రమంలో ప్లాంట్ జెనెటిక్ సంస్థ డైరెక్టర్ జ్ఞానేంద్ర ప్రతాప్‌సింగ్,వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ రఘురామిరెడ్డి ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. కార్యక్రమంలో విశ్వవిదాలయం ఉన్నతాధికారులు డాక్టర్ అనిత,డాక్టర్ జమునారాణి, ఎన్‌బీపీజీఆర్ సంస్థ శాస్త్రవేత్తలు డాక్టర్ వి సలియా చలం, డాక్టర్ అనిత కోడూరు పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే చర్యలు

పటాన్‌చెరు టౌన్: బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే చర్యలు తీసుకుంటామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం పటాన్‌చెరు డివిజన్‌లో చెత్త రహదారుల పై వేయకుండా అవగాహన కల్పించే చిత్రాలను గోడలకు అతికించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తడి పొడి చెత్తను ఎప్పటికప్పుడు రిక్షా కార్మికులకు ప్రజలు చెత్త అందజేయాలని, బయట వేస్తే చర్యలు తప్పవని తెలిపారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య సిబ్బంది ఆంజనేయులు పాల్గొన్నారు.